క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నేపథ్యంలో పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. రెడ్డిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లె, యర్రపల్లె గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

కొనకనమిట్ల ఎస్సైగా శ్రీకాంత్


శ్రీకాంత్

కొనకనమిట్ల: కొనకనమిట్ల నూతన ఎస్సైగా బి.శ్రీకాంత్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలులో పనిచేస్తున్న ఆయన బదిలీపై కొనకనమిట్లలో నియమితులయ్యారు. నూతన ఎస్సైకి ఏఎస్సై ముల్లా సాహెబ్, స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

వన్యప్రాణులను సంహరిస్తే జైలుకే..


అవగాహన కల్పిస్తున్న ఫారెస్ట్ డీఆర్వో నాగరాజు

మార్కాపురం: వన్యప్రాణులను సంహరిస్తే జైలు శిక్ష తప్పదని మార్కాపురం అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగరాజు హెచ్చరించారు. వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి, పెద్దారవీడు మండలంలోని గుండంచర్ల గ్రామాల్లో ప్రజలకు అటవీ చట్టాలపై అవగాహన కల్పించారు. పెద్దపులి, చిరుతలు, జింకలు, నెమళ్లు, దుప్పి, కణితి తదితర వన్యప్రాణులు కనిపిస్తే వలలు, ఉచ్చులు వేసి పట్టుకుంటే జైలుకు పంపుతామని హెచ్చరించారు. వన్యప్రాణులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని చెప్పారు. అనంతరం వాహనాల తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బాబా పుణ్యతిథి


అన్నసంతర్పణను ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగరాజు

మార్కాపురం: షిరిడీ సాయిబాబా 107వ పుణ్యతిథి సందర్భంగా స్థానిక నెహ్రూ బజారులోని బాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని డీఎస్పీ నాగరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో మందిరం వ్యవస్థాపక కార్యదర్శి గోపాలుని హరిహరరావు, కమిటీ అధ్యక్షుడు పీవీ సత్యనారాయణ, కోశాధికారి పీఎస్ఎల్‌వీ నాగరాజు, యువ సేవా సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణమోహన్, కరీం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించండి

● ఎంపీపీ లక్ష్మీదేశి కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీదేవి, పక్కన ఎంపీడీఓ బాలచెన్నయ్య

మార్కాపురం: అధికారులు పార్టీలకతీతంగా పనిచేయాలని ఎంపీపీ లక్ష్మీదేవి కృష్ణారెడ్డి సూచించారు. శుక్రవారం మార్కాపురం మండల పరిషత్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలని, సమస్యలను సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రస్తుత సమావేశంలో సభ్యులు చెప్పిన సమస్యలను నోట్‌చేసుకుని వచ్చే సమావేశం నాటికి పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయి అధికారులందరూ తరచుగా గ్రామాలను సందర్శిస్తూ పారిశుధ్యం, నీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణతోపాటు నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందుతున్నాయో లేదో పరిశీలించాలన్నారు. సమావేశానికి సమగ్రమైన సమాచారంతో రావాలని అధికారులకు సూచించారు. గజ్జలకొండ ఎంపీటీసీలు శ్రీనివాసరెడ్డి, రమేష్ మాట్లాడుతూ.. తమ గ్రామంలో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని, సమస్య పరిష్కరించాలని సభ దృష్టికి తెచ్చారు. మూడు రోజులకోసారి నీరు ఇస్తుండటంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమావేశంలో ఎంపీడీఓ బాలచెన్నయ్య, పీఆర్ ఏఈ మోహన్‌రాజు, ఎంఈఓ రాందాస్‌నాయక్, ఏఓ బుజ్జీబాయి, ఏపీఓ నాగరాజు, ఏపీఎం పిచ్చయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కొనకనమిట్ల : గొట్లగట్టులో ఆర్యవైశ్య మహిళల బతుకమ్మ ఉత్సవం


కొమరోలులో వెంకటేశ్వరస్వామి రథోత్సవం


తర్లుపాడు : వేణుగోపాలస్వామి పార్వేట ఉత్సవంలో జడ్జి దేవేందర్‌రెడ్డి దంపతులు, పక్కన డాక్టర్ శ్రావణి

జగజ్జననీ.. దివ్యదాయినీ..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఊరూవాడా వేడుకగా నిర్వహించారు. గురువారం విజయ దశమి సందర్భంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అమ్మవారి మండపాలు, ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పార్వేట ఉత్సవాలు వైభవంగా సాగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను రంజింపజేశాయి.

● శరణువేడిన భక్తజనం.. ఊరూవాడా వేడుకగా దసరా సంబరం
● పార్వేట ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలం


బేస్తవారిపేటలో పులివాహనంపై వాసవీమాత ఊరేగింపు


బేస్తవారిపేట : మహాగౌరిగా కోటసత్యమాంబదేవి


గిద్దలూరు : బంగారు చీరలో వాసవీ మాత


కంభంలో మహంకాళీదేవిగా కన్యకాపరమేశ్వరి


కొనకనమిట్ల : గొట్లగట్టులో వాసవీమాత గ్రామోత్సవం


మార్కాపురం : బంగారు చీరలో వాసవీమాత


మార్కాపురం : దసరా మండపంలో చెన్నకేశవుడు

బేస్తవారిపేట: స్థానిక వాసవీ మాత ఆలయంలో అమ్మవారు గురువారం విజయలక్ష్మిగా దర్శనమిచ్చారు. అమ్మవారి ఉత్సవమూర్తిని పులివాహనంపై ఊరేగించారు. గొట్లమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారు మహాగౌరిగా దర్శనమిచ్చారు. బేస్తవారిపేట, సోమవారిపేట, ఆదివారిపేట గ్రామాల్లోని దేవతామూర్తుల పార్వేట ఉత్సవం జెడ్పీ బాలుర హైస్కూల్ ఆవరణలో నిర్వహించారు.

■ గిద్దలూరు రూరల్: స్థానిక నల్లబండ బజారులోని కనకదుర్గమ్మ ఆలయం, కాశినాయకుంటలోని గాయత్రిమాత ఆలయం, రేడియో బావి సమీపంలోని కాళికామాత ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ మాతను బంగారు చీరతో అలంకరించారు. శమీపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాచర్ల రోడ్డులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజల అనంతరం అన్న సంతర్పణ చేశారు.

■ కంభం: స్థానిక వాసవీ మాత ఆలయంలో అమ్మవారు మహంకాళీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. రావిపాడులో పోలేరమ్మ తల్లికి ఘనంగా పూజలు చేశారు.

■ కొమరోలు: స్థానిక వాసవీమాత ఆలయంలో విశేష పూజల అనంతరం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అలాగే వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం రథోత్సవాన్ని కనులపండుగగా నిర్వహించారు.

వైభవంగా పార్వేట ఉత్సవం

మార్కాపురం టౌన్: విజయ దశమి సందర్భంగా స్థానిక వాసవీమాత ఆలయంలో అమ్మవారు బంగారు చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు పార్వతిదేవిగా, రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో రమాదేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వాహనాలకు పూజలు చేయించారు. గురువారం సాయంత్రం చెన్నకేశవ స్వామి పార్వేట ఉత్సవం దసరా మండపం వద్ద వైభవంగా నిర్వహించారు. అమలక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామివారిని శమీ వృక్షం వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

■ కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు, కొనకనమిట్ల, పెదారికట్ల, రేగడపల్లి గ్రామాల్లో అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. గొట్లగట్టులో వాసమాత గ్రామోత్సవం కనులపండువగా సాగింది. ఆర్యవైశ్య సంఘ మహిళల బతుకమ్మ బోనాల నృత్య ప్రదర్శన, కలశ ఉత్సవం భక్తులను అలరించింది. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో దసరా పండగ సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు.

వేణుగోపాలుడికి మార్కాపురం జడ్జి పూజలు

తర్లుపాడు: విజయదశమి సందర్భంగా స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో పార్వేట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మార్కాపురం కోర్టు సీనియర్ సివిల్ జడ్జి బి.దేవేందర్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. స్వామివారి ఉత్సవ మూర్తులతో జమ్మిచెట్టు వద్దకు చేరుకుని శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా జడ్జి దంపతులకు పూర్ణ కుంభంతో ఆలయ అధికారులు స్వాగతం పలికారు. మార్కాపురం శ్రావణి హాస్పిటల్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకురాలు డాక్టర్ చప్పిలి కనకదుర్గ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ధర్మకర్త విజయభాస్కర్ రావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


మార్కాపురం : ఆమలక లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శమీపూజ

పార్టీ అభివృద్ధికి ఐకమత్యంగా పనిచేయండి


పార్టీ నేతలతో మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

● వైఎస్సార్ సీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే కేపీ సూచన

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు ఐకమత్యంతో పనిచేయాలని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జున రెడ్డి పేర్కొన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అంకితభావంతో పనిచేద్దామన్నారు. గిద్దలూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ నేతలతో కేపీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.కీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై అంతులేని అభిమానం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు గుర్తించి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వైఎస్సార్ సీపీపై ఉందన్నారు. కూటమి నేతల దాడులు, అక్రమ కేసుల బాధితులు డిజిటల్ బుక్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. డిజిటల్ బుక్‌పై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మానం బాలిరెడ్డి, వేమిరెడ్డి రామచంద్రారెడ్డి, బి.ఓబులరావు, కాతా నరసింహారెడ్డి, బాదం గోపాల్, పాలుగుళ్ల నరసింహారెడ్డి, గోడి వెంకటేశ్వరరెడ్డి, పోలెపల్లె శివ, మిత్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కారం



అంబవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

గిద్దలూరు రూరల్: మండలంలోని అంబవరంలో శుక్రవారం భూముల రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూవివాదాల పరిష్కారానికి రీసర్వే ఉపయోగపడుతుందన్నారు. అంబవరంలో 5198 ఎకరాల భూములున్నాయని, అందులో ప్రభుత్వ భూమి 592 ఎకరాలు ఉందని వివరించారు. సర్వే సమయంలో రైతులు తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. మండల సర్వేయర్ ఎం.ఆంజనేయులు, డీటీ నాయబ్‌రసూల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మలిపెద్ది సుబ్బయ్యకు 'అన్నా' నివాళి


సుబ్బయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: మార్కాపురం మార్కెట్ యార్డు మొదటి చెర్మన్‌గా, లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థాన చైర్మన్ గతంలో సేవలందించిన మలిపెద్ది వెంకటసుబ్బయ్య అనారోగ్య కారణాలతో మృతి చెందారు. శుక్రవారం ఆయన భౌతికకాయాన్ని మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజార్‌లో నివాసంలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజ


పూజలో పాల్గొన్న సీఐ సుబ్బారావు, ఎస్సైలు

మార్కాపురం: దసరా పండుగను పురస్కరించుకుని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు ఆధ్వర్యంలో గురువారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. తొలుత దుర్గామాతకు పూజలు చేసి, తమ ఆయుధాలను పూజలో ఉంచారు. కార్యక్రమంలో సీఐ సుబ్బారావు, పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమరావు, ఏఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో మరిన్ని ప్రయోజనాలు

గిద్దలూరు రూరల్: మండలంలోని ముండ్లపాడు గ్రామంలో స్థానిక ఎంపీడీఓ సీతారామయ్య ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. తగ్గించిన జీఎస్టీ సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. సామాన్య ప్రజలతో పాటుగా సన్న చిన్నకారు రైతులను దృష్టిలో పెట్టుకుని జీఎస్టీ రేట్లు తగ్గించినట్లు ఏఓ విజయభాస్కర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీకాంత్‌రెడ్డి, వీఆర్‌ఓ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించేందుకు శుక్రవారం బేస్తవారిపేటలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ యంత్ర పరికరాలు 7 శాతం తక్కువ ధరకు లభిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భూపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి

పొదిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిన నేపథ్యంలో నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ వస్తువు ధరలు 10 నుంచి 20 శాతం మేర తగ్గిన విషయమై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం జీఎస్టీ తగ్గింపు పోస్టర్లను ఆవిష్కరించారు.

వెలగలపాయలో తాగునీటికి కటకట


మరమ్మతులకు నోచుకోని మోటారు పైపులైను

అర్ధవీడు: మండలంలోని వెలగలపాయ గ్రామ పంచాయతీలో వారం రోజులుగా నీటి ఎద్దడి నెలకొంది. త్రీఫేజ్ డీప్ బోర్ నుంచి ఓవర్ హెడ్ ట్యాంకుకు నీటిని సరఫరా చేసే పైప్‌లైను పగిలిపోవడంతో సమస్య తలెత్తింది. నీటి సమస్యపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కమనీయం.. గోవిందుని కల్యాణం


వెంకటేశ్వరస్వామి కల్యాణానికి తిలకిస్తున్న భక్తులు

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివారులో గుండ్లకమ్మ ఒడ్డున కొలువై ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, కంభం రోడ్డులోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అర్చకులు అకలంకం రామానుజాచార్యులు, దరూరి అరుణ్‌కుమార్ కల్యాణ క్రతువు నిర్వహించగా ఉభయదాతలు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


మార్కాపురంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు తదితరులు


గిద్దలూరులో మహాత్మాగాంధీ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకుల నివాళి


తర్లుపాడు జెడ్పీ హైస్కూల్లో ఆర్యవైశ్య నాయకులు..


బేస్తవారిపేటలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

ప్రపంచానికి ఆదర్శమూర్తి గాంధీ

సాక్షి నెట్‌వర్క్: ప్రపంచానికే జాతిపిత మహాత్మాగాంధీ ఆదర్శమూర్తిగా నిలుస్తున్నారని, ఆయన బోధనలు సమస్త మానవాళికి అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకుని మహాత్ముడి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్య్రం కోసం అహింస, సత్యాగ్రహం ద్వారా ఆయన నడిపిన పోరాటాలను గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, మాజీ సైనికులు, త్రివిక్రమ అభ్యుదయ కళా సంఘం సభ్యులు, పోలీసుల ఆధ్వర్యంలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల లాల్ బహదూర్‌శాస్త్రి జయంతిని నిర్వహించి ఆయన సేవలను కీర్తించారు.

కుల వివక్షపై నిరంతర పోరాటం



కేవీపీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మార్కాపురం టౌన్: కుల వివక్షపై కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) నిరంతర పోరాటం చేస్తోందని సంఘ జిల్లా అధ్యక్షుడు జె.రాజు పేర్కొన్నారు. కేవీపీఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బాపూజీ కాలనీలో జెండా ఆవిష్కరించారు. తంగిరాలపల్లి, తాడివారిపల్లి గ్రామాల్లో దళితులకు అండగా నిలిచి భూములపై హక్కులు కల్పించేందుకు పోరాటం చేసామని రాజు చెప్పారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డీకే రఫీ, కాశయ్య, పేరయ్య, జగన్నాథం రామయ్య తదితరులు పాల్గొన్నారు.